నమస్తే తెలంగాణ

మెదక్

I | హైదరాబాద్, ఆదివారం 23 మార్చి 2025 | MEDAK

ప్రజ్ఞాపూర్‌లో కళాకారులతో కలిసి ఆడుతున్న ఎమ్మెల్సీ కవిత

రుణమాఫీపై హరీశ్‌రావు

ప్రశ్నల వర్షం

అసెంబ్లీలో సిద్దిపేట రైతుల గురించి ప్రస్తావన

ప్రభుత్వాన్ని నిలదీసిన మాజీ మంత్రి

ఆసెంబ్లీలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, మార్చి 22 : సిద్దిపేట రైతులందరికీ పంట రుణమాఫీ చేశామన్న ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క మాటలు ఉట్టివేనని మాజీ మంత్రి,సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అసెంబ్లీ వేదికగా ప్రభుత్వ బండారాన్ని బట్ట బయలు చేశారు. శనివారం బడ్జెట్‌పై అసెంబ్లీలో జరిగిన చర్చ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. సిద్దిపేట రైతులందరికీ రుణమాఫీ చేశామన్న మంత్రి భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యల్లో డొల్లతనాన్ని ఎత్తి చూపారు. రాష్ట్రంలో పంట రుణమాఫీ అనేది అదొక దారుణ విషాద గాథ అన్నారు. స్టేట్ లెవల్ బ్యాంకర్ల మీటింగ్‌లో సంపూర్ణ రుణ మాఫీకి కావాల్సింది రూ.49,500 వేల కోట్లుగా తేల్చారని, ఒక్క సంవత్సరం అవినీతి చేయకుండా కడుపు కట్టుకుంటే రూ. 41 వేల కోట్లు ఒక్క దెబ్బకు మాఫీ చేయొచ్చని సీఎం రేవంత్‌రెడ్డి భారీ డైలాగులు దంచారని, భట్టి విక్రమార్క గత బడ్జెట్ ప్రసంగంలో రూ. 31వేల కోట్ల రుణమాఫీ చేస్తామని ఘనంగా ప్రకటించి, ఈ బడ్జెట్ లోనేమో రూ.20 వేల కోట్లు ఇచ్చాం అంటున్నారని హరీశ్‌రావు విమర్శించారు. కానీ, వాస్తవానికి రూ. 16 వేల కోట్ల రుణమాఫీ కూడా ప్రభుత్వం చేయలేదన్నారు. మరి కడుపు కట్టుకోలేదో, అవినీతి ఆకలి ఆపుకోలేదో ప్రభుత్వానికే తెలియాలని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు.

సిద్దిపేటలో రుణమాఫీ గురించి వివరిస్తూ..

సిద్దిపేట నియోజకవర్గంలో బ్యాంకుల్లో పంటరుణం తీసుకున్న రైతులు 43,363 మంది ఉండగా, రుణమాఫీ కేవలం 20,514మంది రైతులకు మాత్రమే అయ్యిందన్నారు. రుణమాఫీ కాని రైతులు 22,849 ఉండగా, ఇందులో రూ.2లక్షలలోపు కాని వారు 10,212 రైతులు ఉన్నారని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఫైనల్‌గా రుణమాఫీ అయిన రైతుల సంఖ్య తక్కువ, రుణమాఫీ కాని రైతుల సంఖ్య ఎక్కువన్నారు. రూ.2లక్షల కంటే ఎక్కువ రుణం ఉన్న వారు మీదున్న రుణం కట్టండి, మిగతాది మాఫీ చేస్తానని సీఎం ప్రకటించడంతో ఆయన మాటలు నమ్మి చాలామంది రైతులు అప్పు తెచ్చి పైసలు కట్టినట్లు హరీశ్‌రావు గుర్తుచేశారు. సిద్దిపేట నియోజకవర్గంలోని గుర్రాలగొందిలో దమ్మర్‌పల్లి శ్రీనివాస్‌రెడ్డి అనే రైతు యూబీఐ బ్యాంకులో ఆగస్టు 30న రూ. 50వేలు కట్టాడని, నారాయణరావుపేటకు చెందిన జి.సత్తిరెడ్డి అనే రైతు రూ.2.60లక్షల రుణం ఉంటే, మిత్తితో కలిపి యూబీఐ బ్యాంకులో లోన్ ఉంటే, అందులో రూ.76 వేలు కట్టిండని హరీశ్‌రావు తెలిపారు. బంజేరుపల్లికి చెందిన మరో రైతు అక్తర్ ఖుస్రో రూ.2,00,600 అప్పు ఉంటే, మిత్తితో కలిపి మీదున్న రూ.10వేలు కట్టిండని, ఇట్లాంటి ఉదాహరణలు ఎన్నో అని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఈ రోజువరకూ వారికి రుణమాఫీ కాలేదన్నారు. వారికి ఎప్పుడు రుణమాఫీ చేస్తారో ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క చెప్పాలన్నారు. రుణమాఫీపై చర్చకు మీ మధిరకు పోదామా? లేదా మా సిద్దిపేటకు వస్తారా? అని మంత్రిని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఈ రాష్ట్రంలో ఏ ఊరుకు పోదామో మీరే చెప్పాలని, వంద శాతం రుణమాఫీ జరిగి ఉంటే క్షమాపణలు చెప్పడానికి తాను సిద్ధమని, మీరు సిద్ధమా?... మంత్రి భట్టి విక్రమార్కను హరీశ్‌రావు ప్రశ్నించారు.

కేసీఆర్ హయాంలోనే

మల్లన్న క్షేత్రాభివృద్ధి

- దేశవ్యాప్త ఉద్యమాలకు తెలంగాణ వేగుచుక్క
- బీసీ బిల్లులను కేంద్రం ఆమోదించేలా రాష్ట్రం చొరవ చూపాలి
- కొమురవెల్లిలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- మల్లన్నకు బోనం సమర్పించి పట్నం వేసి మొక్కులు చెల్లింపు
- కొమురవెల్లిలో జాగృతి అధ్యక్షురాలికి గ్రాండ్ వెల్‌కం
- భారీగా తరలివచ్చిన బీఆర్‌ఎస్, జాగృతి, బీసీ సంఘాల నాయకులు

కొమురవెల్లి మల్లన్న ఆలయంలో పట్నం వేసి మొక్కు చెల్లించుకుంటున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

చేర్యాల, మార్చి 22: కొమురవెల్లి మల్లన్న క్షేత్రం కేసీఆర్ పాలనలో అన్నివిధాలుగా అభివృద్ధి చెందిందని, హుండీ ఆదాయం పెరిగిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. బీసీ బిల్లు ఆమోదం పొందడంతో శనివారం కొమురవెల్లి మల్లన్నను ఆమె దర్శించుకున్నారు. బోనం సమర్పించి పట్నం వేసి పూజలు చేశారు. యునైటెడ్ పూలే ఫ్రంట్, తెలంగాణ జాగృతి, బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఆలయంలోని గంగరేగు చెట్టు వద్ద పట్నంవేసి బోనం సమర్పించారు. స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అంతకుముందు కొమురవెల్లి మల్లన్న స్వాగత తోరణం వద్ద బీఆర్‌ఎస్, బీసీ సంఘాలు, జాగృతి నాయకులు ఎమ్మెల్సీ కవితకు ఘనస్వాగతం పలికారు. అనంతరం తెలంగాణ తల్లి, గాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ తర్వాత ఆలయ గెస్ట్‌హౌస్‌లో మీడియాతో ఎమ్మెల్సీ కవిత మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన పెద్ద రిజర్వాయర్‌కు కొమురవెల్లి మల్లన్నసాగర్‌గా కేసీఆర్ నామకరణం చేశారని, కొమురవెల్లి మల్లన్న క్షేత్రం ఉమ్మడి ఏపీలో విస్మరించబడిందని, కేసీఆర్ పాలనలో మల్లన్న క్షేత్రాభివృద్ధికి రూ.50కోట్ల మేరకు ఖర్చు చేసినట్టు తెలిపారు. స్వామి వారికి మాన్యం ఉండాలని 130 ఎకరాలు కేటాయించారని, స్వర్ణకిరీటం, వెండి సింహాసనం, ఆలయంలోని ద్వారాలకు వెండి తాపడం చేయించినట్లు గుర్తుచేశారు. వీటితో పాటు రూ.50కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, పట్నాల మండపం, ఢమరుకం,త్రిశూలం, బండగుట్ట పైభాగంలో 50కాటేజీల నిర్మాణంతో రూ.12 కోట్లతో క్యూకాంప్లెక్స్ నిర్మాణం, షాపింగ్ కాంప్లెక్స్, బుకింగ్ కౌంటర్ నిర్మాణం, దేవాలయం వద్దకు వచ్చేందుకు రాజీవ్ రహదారి నుంచి కొమురవెల్లి వరకు డబుల్ రోడ్డు నిర్మించినట్లు తెలిపారు. కొమురవెల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనలో కొమురవెల్లి అసెంబ్లీ నియోజకవర్గంగా అయ్యే అవకాశం ఉందన్నారు.

దేశానికి దారి చూపాలి...

తెలంగాణ జాగృతి,యునైటెడ్ పూలే ఫ్రంట్ డిమాండ్‌కు తలొగ్గి ప్రభుత్వం వేర్వేరు అసెంబ్లీలో బీసీ బిల్లును పెట్టి బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఆమోదించిందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఈ చట్టాలను కేంద్రం నుంచి ఆమోదించుకుని అమలు చేసేందుకు ప్రభుత్వ కార్యాచరణ రూపొందించాలని కోరారు. బీసీ బిల్లులపై ఎవరైనా కోర్టుల్లో సవాలు చేస్తే ప్రభుత్వం గట్టిగా కొట్లాడాలని సూచించారు. తెలంగాణలో ప్రారంభమైన బీసీ ఉద్యమం దేశంలోని అన్ని రాష్ట్రాలకు వేగుచుక్కవలే తోవ్వ చూపుతుందని, అందుకు యునైటెడ్ పూలే ఫ్రంట్, తెలంగాణ జాగృతి ముందు వరుసలో కాగడ వలే దారి చూపుతుందని, అది విజయవంతం కావాలని కొమురవెల్లి మల్లన్నకు మళ్లీ మొక్కుకున్నట్లు కవిత తెలిపారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, మల్లన్న ఆలయ మాజీ చైర్మన్లు సెవెల్లి సంపత్, గీస భిక్షపతి, మాజీ జడ్పీటీసీ సిలువేరు సిద్దప్ప, జాగృతి రాష్ట్ర నాయకులు పబ్బొజు విజేందర్, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకల పర్వతాలు యాదవ్, మాజీ వైస్ ఎంపీపీ కాయిత రాజేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు ముత్యం నర్సింహులు, ముస్త్యాల బాల్‌నర్సయ్య, మీస పార్వతి, పచ్చిమడ్ల మానస, యునైటెడ్ పూలే ఫ్రంట్, జాగృతి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయంలో ఎమ్మెల్సీ కవితకు దేవుడి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

కాంగ్రెస్ పాలనలో

గోదావరి ఎడారి

- కేసీఆర్ పాలనలో జీవనదిలా గోదావరి
- గోదావరి జలాలతో ప్రతి చెరువు నింపాం
- కుట్రలో భాగంగానే గోదావరిని ఎండబెట్టారు
- కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్, బీజేపీ కుట్రలు
- ఎస్‌ఎల్‌బీసీ ఘటనపై ఎన్‌డీఎస్‌ఏ ఎందుకు స్పందించడం లేదు..
- ప్రభుత్వంపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శలు

గజ్వేల్, మార్చి 22: 'తలాపునే పారుతుంది గోదారి... మన బతుకులు ఎడారి' అని ఉద్యమ సమయంలో గోదావరి నది గురించి ప్రతి ఒక్కరం గుర్తుచేసుకునే వాళ్లమని, కేసీఆర్ తన పాలనలో గోదావరి నదిని సస్యశ్యామలం చేసి జీవనదిలా మార్చారని, నేడు కాంగ్రెస్ పాలకులు గోదావరిని ఎడారిగా మార్చారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. శనివారం ప్రజ్ఞాపూర్ వద్ద రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పాదయాత్రకు ఆమె సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి ప్రతి చెరువును నింపడంతో పాటు హైదరాబాద్ మహానగరానికి తాగునీళ్లను, పరిశ్రమలకు నీళ్లు ఇచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. ఎన్నడూ లేనివిధంగా ఎండాకాలంలోనూ చెరువులు మత్తళ్లు దుంకాయని, అందులో కేసీఆర్ సంకల్పం ఎంతో ఉందని గుర్తు చేశారు. కేసీఆర్ పట్టుదల, సంకల్పంతోనే కాళేశ్వరం నిర్మాణం చేసుకున్నట్లు చెప్పారు. ఎన్నికల సమయంలో కాళేశ్వరం, మేడిగడ్డ వద్ద ఏమీ జరిగిందో అనుమానంగానే ఉందని, కాంగ్రెస్, బీజేపీలు బీఆర్‌ఎస్‌ను ఏమి చేయాలనే కుట్రలో భాగంగానే ఎన్నికల సమయంలో వివాదం చేశారన్నారు. ఢిల్లీ నుంచి ఒక్క రోజులోనే నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్‌ఏ) వాళ్లు వచ్చి గోదావరిలోకి దిగి ఫొటోలు తీసుకెళ్లారని, కానీ.. ఎస్‌ఎల్‌బీసీ కూలిపోయి నెలన్నర అవుతున్నా ఎన్‌డీఎస్‌ఏ ఎందుకు రాలేదని కవిత ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికార దాహంతో సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు అయ్యారని, ఇప్పుడేమో రైతులు సాగు చేసుకున్న వరి పంటను ఎండబెడుతున్నారని, ఇదంతా కుట్రనే అని ప్రతి ఒక్కరూ ఆలోచించాలన్నారు. మేడిగడ్డ బాగాలేదని ఒక్క చెరువు నింపకుండా చేశారని, ప్రస్తుతం గోదావరిని ఎడారి చేశారన్నారు. లక్షలాది ఎకరాల్లో వరి పంట ఎండుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కేసీఆర్ వచ్చిన తరువాతనే తుపాకులగూడెం వద్ద సమ్మక్క–సారలమ్మ బ్యారేజీని నిర్మించారన్నారు. సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మరో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కలిసి మోటర్లను ఆన్ చేద్దామని వెళ్తే అక్కడ బటన్ ఆన్ చేస్తే నీళ్లు రాలేదని, సాగునీటి మంత్రికి ఆ శాఖలో ఏమి జరుగుతుందో కూడా తెలువదని ఎమ్మెల్సీ కవిత ఎద్దేవా చేశారు. కేవలం రూ.6కోట్లు ఖర్చు చేసి మోటర్లను రిపేర్ చేస్తే, లక్షల ఎకరాల పంట చేతికొచ్చి రైతులు సంతోషంగా ఉంటారని, ఆ సోయి కూడా ప్రభుత్వానికి లేదని విమర్శించారు. అనంతరం డప్పుచప్పుల మధ్య కళాకారులతో కలిసి కవిత ఆడారు. కార్యక్రమంలో ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, బీఆర్‌ఎస్, జాగృతి శ్రేణులు, అభిమానులు, రైతులు పాల్గొన్నారు.

నీళ్లిచ్చి పంటలను కాపాడండి

అసెంబ్లీలో మాట్లాడుతున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

- మల్లన్నసాగర్ ఉప కాల్వలు నిర్మించాలి
- కరెంట్ సమస్యలు పరిష్కరించాలి
- దుబ్బాక మున్సిపల్‌కు మంజూరైన నిధులు విడుదల చేయాలి
- అసెంబ్లీలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, మార్చి 22: దుబ్బాక నియోజకవర్గంలో మల్లన్నసాగర్ ప్రాజెక్టు ఉన్నా నియోజకవర్గ రైతులు సాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారని, ఉప కాల్వల నిర్మాణం చేపట్టకపోవడంతోనే సమస్య నెలకొందని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి శాసనసభలో ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. దుబ్బాక నియోజకవర్గంలో నెలకొన్న సాగునీరు, కరెంట్ సమస్యలు, మున్సిపల్ అభివృద్ధికి సంబంధించిన నిధుల గురించి శనివారం అసెంబ్లీలో ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి ప్రస్తావించారు. మల్లన్నసాగర్, కొండ పోచమ్మసాగర్ నుంచి దుబ్బాక నియోజకవర్గానికి సాగునీరు ఇచ్చేందుకు 10, 11, 12, 13 ప్యాకేజీల ద్వారా ఉపకాల్వలు నిర్మించాల్సి ఉందన్నారు. ఉప్పరపల్లి కెనాల్, శంకరంపేట కెనాల్, రామయంపేట కెనాల్, సిద్దిపేట కెనాల్‌లు (ప్రధాన కాల్వల నుంచి ఉప కాల్వల నిర్మాణం పూర్తికాక రైతులు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఉప కాల్వల ద్వారా సాగునీరు వస్తుందని చాలామంది రైతులు ఆశపడి వరినాట్లు వేశారని, తీరా సాగునీరందక పంటలు ఎండిపోయి నష్టపోయారని తెలిపారు. తమ సొంత మండలం దుబ్బాకలోని అచ్చుమాయిపల్లి–పోతారం పిల్ల కాల్వ నిర్మాణం చేపట్టకపోవడంతో అక్కడి రైతులు సొంత డబ్బులతో కాల్వలు తీసుకుంటున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ఉప కాల్వల నిర్మాణంపై మెగా ఏజెన్సీ వారు పట్టించుకోవడం లేదన్నారు. ఇకనైనా సంబంధిత అధికారులతో, వర్క్ ఏజెన్సీతో మాట్లాడి త్వరగా ఉప కాల్వల నిర్మాణ పనులు పూర్తిచేయాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే కోరారు.

డీడీలు కట్టినా ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వడం లేదు..

దుబ్బాక నియోజకవర్గంలో కరెంట్ సమస్య నెలకొందని ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అస్తవ్యస్త కరెంట్ సరఫరాతో తరచూ వ్యవసాయ మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు రైతులకు ఇవ్వాల్సి ఉండగా స్టోర్స్‌లో సామగ్రి లేదని విద్యుత్ అధికారులు చెబుతున్నారని, వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లకు రైతులు డీడీలు కట్టినా ఇవ్వడం లేదన్నారు.

రూ.20 కోట్లు విడుదల చేయాలి

దుబ్బాక మున్సిపల్‌కు గతంలో టీయూఐఎఫ్‌డీసీ ద్వారా రూ. 20 కోట్లు మంజూరయ్యాయని, వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్, టౌన్‌హాల్ తదితర వాటికి ప్రొసీడింగ్‌లు అందజేస్తే, మున్సిపల్‌కు మంజూరైన నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. వెంటనే ఆ నిధులు తిరిగి విడుదల చేసి దుబ్బాక మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

కాంగ్రెస్‌ను చూసి ప్రజలు నవ్వుకుంటున్నరు

- నీళ్లివ్వలేని అసమర్థులు కాంగ్రెసోళ్లు
- బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి విమర్శ
- కోరుకంటి చందర్ పాదయాత్రకు ఘనస్వాగతం

శ్రీగిరిపల్లి వద్ద స్వాగతం పలుకుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి, నాయకులు

గజ్వేల్, మార్చి 22: అధికారంలో ఉండి గజ్వేల్‌ను అభివృద్ధి గురించి ఆలోచన చేయకుండా పాదయాత్రలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ చేపట్టిన పాదయాత్రకు శనివారం గజ్వేల్ మండలం కొడకండ్ల, శ్రీగిరిపల్లి రింగ్‌రోడ్డు వద్ద బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి వంటేరు ప్రతాప్‌రెడ్డి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రాజెక్టుల నిర్మాణం చేపడితే కనీసం రైతులకు వాటి ద్వారా సాగునీళ్లు ఇవ్వలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని విమర్శించారు. గోదావరి గోస పాదయాత్రపై రాష్ట్రంలోని రైతులు ఆలోచించాలన్నారు. కాంగ్రెస్ వాళ్లు చేపడుతున్న పాదయాత్ర వారి పదవులను కాపాడుకోవడానికే తప్పా ప్రజల కోసం కాదన్నారు. గజ్వేల్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసిన కేసీఆర్‌ను విమర్శించే అర్హత గజ్వేల్ కాంగ్రెస్ నాయకులకు లేదన్నారు. దమ్ముంటే గజ్వేల్‌ను మరింతగా అభివృద్ధి చేసి చూపాలన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి, ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశంగౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మధు, నాయకులు చంద్రమోహన్‌రెడ్డి, మల్లేశం, శ్రీనివాస్‌రెడ్డి, గుంటుక రాజు, రాజిరెడ్డి, గొడుగు స్వామి పాల్గొన్నారు.

రైతుల ఉసురు తగులుతది

- రామగుండం బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

మర్కూక్, మార్చి 22: అన్నివిధాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల ఉసురు తగులుతుందని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. గోదావరి కన్నీటి గోస పేరుతో ఆయన చేపట్టిన మహా పాద యాత్ర శనివారం సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రానికి చేరుకుంది. ఆయనకు గణేశ్‌పల్లి వద్ద ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ రామచంద్ర, మాజీ ఎంపీపీ పాండుగౌడ్, వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, కృష్ణయాదవ్, మ్యాకల కనకయ్య ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కోరుకంటి చందర్ మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో ఏ ఒక్కవర్గం సంతోషంగా లేదన్నారు. ఒక్క హామీని ప్రభు త్వం నిలబెట్టుకోలేదన్నారు. కేసీఆర్ పాలనలో గోదావరి జీవనదిని తలపించగా, కాంగ్రెస్ వచ్చాక ఎడారిగా మారిందని కోరుకంటి చందర్ తెలిపారు.

గణేశ్‌పల్లిలో మాట్లాడుతున్న కోరుకంటి చందర్

చిన్నశంకరంపేట: చందంపేటలో నేలకూలిన ట్రాన్స్‌ఫార్మర్

వెల్దుర్తి: శెట్‌పల్లి శివారులోని వ్యవసాయ పొలాల్లో విరిగిపడిన విద్యుత్ స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్

అకాల వర్షం.. అపార నష్టం

- నేలకొరిగిన పంటలు.. నష్టపోయిన రైతులు
- నేలరాలిన మామిడి.. విరిగిపడిన చెట్లు
- కూలిన విద్యుత్ స్తంభాలు
- పలుచోట్ల ఆస్తి నష్టం

ఉమ్మడి మెదక్ జిల్లాలో కురిసిన అకాల వర్షానికి వందలాది ఎకరాల్లో పంటలు దెబ్బతినడంతో పాటు ఆస్తినష్టం జరిగింది. గాలిదుమారంతో విద్యుత్ స్తంభాలు నేలకూలడం, విద్యుత్ వైర్లు తెగిపోయాయి. నిన్నమొన్నటి వరకు నీళ్లులేక పంటలు ఎండిపోగా, శుక్రవారం గాలిదుమారానికి పంటలు నేలవాలగా రైతులకు నష్టం వాటిల్లింది.

పెద్దశంకరంపేట మండలంలో...

పెద్దశంకరంపేట, మార్చి 22: మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండలంలోని వీరోజిపల్లి, ఉత్తులూర్, రామోజిపల్లి, నారాయణపల్లి, జూకల్ గ్రామాల్లో సుమారు 30 ఎకరాల జొన్న పంట నేలకొరిగింది. ఉత్తులూర్‌లో రైతులు చంద్రాగౌడ్, సతీష్, జీవయ్య, వీరోజిపల్లి గ్రామానికి చెందిన రైతులు శివరాములు, సాయిలు, కృష్ణ,గోవింద్, సంగయ్యకు చెందిన జొన్నపంట దెబ్బతిన్నది. పంటనష్టం వివరాలను అంచనావేసి ఉన్నతాధికారులకు నివేదిస్తామని మండల వ్యవసాయాధికారి కృష్ణ, ఏఈవో మమత తెలిపారు.

చిన్నశంకరంపేట మండలంలో...

చిన్నశంకరంపేట, మార్చి 22 : మండలంలో గాలిదుమారానికి రెండు ట్రాన్స్‌ఫార్మర్లు, 55 కరెంటు స్తంభాలు నేలకొరిగాయని ట్రాన్స్‌కో ఏఈ దినకర్ తెలిపారు. శనివారం ట్రాన్స్‌కో సిబ్బంది మరమ్మతులు నిర్వహించి కరెంట్ సరఫరాను పునరుద్ధరించారు. చెట్లు రోడ్లకు అడ్డంగా విరిగిపడడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. సూరారం గ్రామానికి చెందిన శ్రీనివాస్ ఇంటిపైకప్పు రేకులు ఎగిరిపోయాయి. చందాపూర్‌కు చెందిన శోభ, మహేశ్వరి, హేమలత, శారద, పుష్పమాలకు చెందిన నివాస రేకులు షెడ్లు, పూరిగుడిసెలు కూలిపోయాయి. చందాపూర్ శివారులో వర్షంతో దెబ్బతిన్న పంటను ఏడీఏ విజయ నిర్మల, ఏవో లక్ష్మీప్రవీణ్ పరిశీలించారు. గాలివానకు మామిడికాయలు నేలరాలాయి.

చేగుంట మండలంలో...

చేగుంట, మార్చి 22: చేగుంట మండలంలోని కర్నాల్‌పల్లి, మక్కరాజిపేట్, రాంపూర్ తదితర గ్రామాల్లో మొక్కజొన్న పంట నేల కొరిగింది. కర్నాల్‌పల్లికి చెందిన రైతు రాజాగౌడ్ ఐదెకరాల చేనులో మొక్కజొన్న, ఎకరన్నరలో తెల్లజొన్న పంట నేలకొరిగింది.

వెల్దుర్తి మండలంలో...

వెల్దుర్తి, మార్చి 22: మండలంలోని బండపోసాన్‌పల్లి, శెట్‌పల్లి, ఏదులపల్లిలో శుక్రవారం రాత్రి గాలిదుమారంతో పలువురి నివాస ఇండ్ల పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. పెద్ద చెట్లు నేలవాలగా, విద్యుత్ తీగలు తెగిపడడంతో పాటు పదుల సంఖ్యలో విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. బండపోసాన్‌పల్లిలో శుక్రవారం రాత్రి నుండి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది గ్రామస్తులు, పంచాయతీ కార్మికుల సహాయంలో చెట్లకొమ్మలను తొలిగించి, తీగలు సరిచేసి విద్యుత్ తీగలను సరిచేస్తూ, స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారు. శెట్‌పల్లిలో వ్యవసాయ పొలాల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, స్తంభం విరిగి పడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. బండపోసాన్‌పల్లి, శెట్‌పల్లి, ఏదులపల్లి గ్రామాలతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో మామిడికాయలు భారీగా రాలిపోయాయి. రైతులకు తీవ్ర నష్టం జరిగింది.

'పది' పరీక్షలకు కరెంట్ కష్టాలు

పాపన్నపేట, మార్చి 22: పాపన్నపేట మండలంలో కరెంట్ కష్టాలు మొదలయ్యాయి. శుక్రవారం సాయంత్రం పాపన్నపేట మండలంలో గాలిదుమారంతో కరెంట్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో పదో తరగతి పరీక్షలు కొనసాగుతుండడంతో విద్యార్థులు చదువుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శనివారం ఉదయం కూడా కరెంటు పోవడంతో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు పరీక్షా కేంద్రాల్లో ఫ్యాన్లు నడవక ఉక్కపోతకు గురయ్యారు.

బాధితులను ఆదుకోవాలి

- బాధితుల గురించి అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి
- క్షేత్రస్థాయిలో పర్యటించి బాధితులకు పరామర్శ

కొల్చారం, మార్చి 22: కొల్చారం, చిలిప్‌చెడ్ మండలాల్లో శుక్రవారం కురిసిన అకాల వర్షం, గాలిదుమారంతో పంటలు దెబ్బతినడం, ఆస్తినష్టం జరగడంపై నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అసెంబ్లీలో మాట్లాడారు. బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. శనివారం సాయంత్రం ఎమ్మెల్యే మండలంలో పర్యటించారు. పోతంశెట్టిపల్లిలోని ఏడుపాయల టీ జంక్షన్ వద్ద కూలిపోయిన హర్షిత రెస్టారెంట్‌తో పాటు దారిపొడవునా గాలికి ఎగిరిపోయిన రెకుల షెడ్లను పరిశీలించి, బాధితులతో మాట్లాడారు. నష్టపోయిన వారి వివరాలు పక్కాగా నమోదు చేసి ప్రభుత్వానికి నివేదిక పంపాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ఆర్ఐ ప్రభాకర్ బాధితుల వివరాలు నమోదు చేసుకుని పంచనామా నిర్వహించారు. ఎమ్మెల్యే ఘటనా స్థలం నుంచి కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ప్రభుత్వం తరపున పరిహారం అందేలా కృషి చేయాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి అరుంధతి శుక్రవారం తమతో దురుసుగా ప్రవర్తించారని, గాలివానకు రోడ్డుపై కూలిన చెట్లను తొలిగించడానికి జేబీసీ పంపించాలని కోరగా.. తాను ఓట్లేసి ఎన్నుకున్న అధికారిని కాదని సమాధానం ఇచ్చారని పోతంశెట్టిపల్లి గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి పంచాయతీ కార్యదర్శికి మెమో ఇవ్వాలని ఎంపీవో కృష్ణవేణిని ఆదేశించారు. అనంతరం విద్యుత్ అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడారు. మరమ్మతులు వేగంగా పూర్తిచేసి కరెంట్ సరఫరా పునరుద్ధరించాలని కోరారు. ఎమ్మెల్యే వెంట బీఆర్‌ఎస్ నాయకులు గౌరీశంకర్ గుప్తా, నరేందర్ రెడ్డి, ముత్యంగారి సంతోష్‌కుమార్, తునుకులపల్లి సంతోష్, కొమ్ముల యాదాగౌడ్, కరెంటు రాజాగౌడ్, రెవెన్యూ అధికారులు, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

బాధితులను ఓదారుస్తున్న ఎమ్మెల్యే

బీఆర్‌ఎస్‌లో చేరిన బీజేపీ నాయకులు

రామాయంపేట, మార్చి 22: రామాయంపేట మండలం కాట్రియాలలో శనివారం బీఆర్‌ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి సమక్షంలో పలువురు బీజేపీ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు, అనేక హామీలు ఇచ్చి గద్దెనెక్కిందని, తీరా అధికారంలోకి వచ్చాక ఒక్క గ్యారెంటీని కూడా సరిగ్గా అమలు చేయడం లేదని కంఠారెడ్డి విమర్శించారు. బీఆర్‌ఎస్‌లో ప్రమోద్‌తో పాటు మరికొంతమంది నాయకులు చేరారు.

కంఠారెడ్డి తిరుపతిరెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన బీజేపీ నాయకులు